## కథ -యల్లాప్రగడ సువర్చలాదేవి

# మా పెరటి మొక్కలు

''ఏవండీ...ఎక్కడున్నారు?'' అంటూ కాఫీ కప్పుతో మా ఆవిడ షరా మామూలుగానే వెదుకులాట ప్రారంభించింది. ఎందుకో కాసేపు మనసు చిన్నపిల్లాడి మనసులా మారిపోయింది. సరదాగా తనని ఆట పట్టించాలని నందివర్ధనం గుబురు వెనకాల నక్కాను. అడ్డంగా వేళ్ళాడుతున్న పొట్లకాయల్ని, అడ్డం వస్తోన్న అరటి ఆకులను పక్కకు తోసుకుంటూ సహనంగా వెదకసాగింది.

''ఎక్కడున్నారు?'' ఈసారి కాస్త అసహనంగా అడుగుతోంది.

''కనుక్కో చూద్దాం'' అంటూ మల్లెపందిరి కింద దూరాను. అలవాటులేని ఆటలాయె! కాస్త నడుం లాగింది. నా మాట వచ్చిన దిశవైపు ఒక్క ఉదుటున కదిలింది తను. నన్ను పట్టుకొంటుందేమో అనే లోగా లేచి వేపచెట్టు వారగా నిలబడ్డాను. ఆశ్చర్యం!! ఈసారి తనే కనబడలేదు. ఈసారి ఆమెను వెదకడం నా వంతయ్యింది అప్రయత్నంగా. అలా, అలా ఓ నాలుగడుగులు వేశానో లేదో వెనగ్గా వచ్చి గట్టిగా చేయి పట్టుకొని ''అమ్మదొంగా! దొరికారు. ఇంకెక్కడికి తప్పించుకొనిపోతారు'' అంది మా ఆవిడ విజయగర్వంగా.

''ఇంకా ఇప్పుడు తప్పించుకోవడం ఏముంది? ఎప్పుడో నీకు బందీ అయ్యానుగా'' అన్నాను తనని మరింత ఉత్సాహపరుస్తూ.

''ఏంటి? ఎప్పుడూ లేనిది శ్రీవారు ఈరోజు ఇలా ఉత్సాహంగా ఉన్నారు. అయినా ఈ వయసులో ఈ ఆటలేంటండి? ఏ నడుమో పట్టుకుపోవడానికి కాకపోతే, ఇంద ఈ కాఫీ తీసుకోండి'' అంటూ కాఫీ కప్పు నా చేతిలో పెట్టింది.

''ఏం లేదోయ్..ఎందుకో ఈరోజు మరింత ఉత్సాహంగా ఉంది. నిన్న మన రంగడు కొన్ని కొత్త హైబ్రీడ్ గులాబీ మొక్కలు తెచ్చాడు. వాటి పనిలో ఉన్నాను. అనుకోకుండా అదే సమయానికి నువ్వొచ్చావు. సరేకదా, కాసేపు నిన్ను సరదాగా ఆట పట్టించాలనిపించింది'' అంటోన్న నాతో ''సరే సరే లేవండి..త్వరగా కాఫీ తాగి స్నానం చేసి తయారవ్వండి. రామనాథం అన్నయ్య వాళ్ళ మనవరాలి బారసాలకి వెళ్ళాలి మర్చిపోయారా?'' అంటూ హడావుడిగా వెళ్ళిపోయింది తను.

కాఫీ తాగి ఈజీ ఛెయిర్‌లో వెనక్కివాలి ఓసారి కాస్త పైకి చూస్తుంటే బాగా బొండాలతో కళకళ లాడుతున్న కొబ్బరిచెట్లు కనబడ్డాయి. 'ఆ భీముడిని పిలిపించి బొండాలు దింపించాలి' అనుకొంటూ ఓసారి నా తోటంతా పరికించి చూశాను. ఓ పక్క సీతాఫలం, మామిడి, జామ, సపోట చెట్లు లాంటివే ద్రాక్ష, దానిమ్మ, ఉసిరి, బత్తాయి, నిమ్మచెట్లతోపాటు, యమున ఇష్టపడి వేసుకొన్న గోరింటాకు చెట్టు, యమున ప్రతిరోజూ భక్తిశ్రద్ధలతో పూజించే తులసిచెట్టు ప్రశాంతతని కలుగచేస్తున్నాయి.


దాదాపు తోటకి మధ్యగా ఉన్న బావి తన తీయటి నీటితోమాకే కాక ఆతోట మొత్తానికి దాహాన్ని తీరుస్తుంటుంది. బావి చప్టానుంచి నేను స్వయంగా చేసిన పిల్ల కాలువలు దాదాపు అన్ని చెట్లకీ నీటిని తీసుకెళ్తూ ఉంటాయి. నాకు బావిలోనుండీ నీటిని తోడి ఆ కాలువ మొదట్లో పోయడం, ఆ నీరు నేను తవ్విన పిల్ల కాలువల ద్వారా ప్రవహించి ఒక్కో చెట్టు పాదు చుట్టూ చేరుతూ ఉంటే మనసుకు ఎందుకో తెలియని అలౌకిక ఆనందం. ఆ చల్లని నీటి వలన, ఆ చెట్లనుండీ వచ్చే స్వచ్ఛమైన గాలి వలన ఆ ప్రదేశం ఎప్పుడూ చల్లగా, ఆహ్లాదంగా ఉండి మనసుకు హాయిని ఇస్తూ ఉంటుంది. ఆ తోటలో ఈజీ చైర్‌లో కూర్చొని నాకిష్టమైన రచయితల పుస్తకాలు చదువుకోవటం, నాకిష్టమైన ఘంటసాల పాటలు వినటం మధురానుభూతి.

మా తోట పక్కనే శివాలయం. ఆ చిన్న ఊళ్ళో మా తోటని కనీసం ఒక్కసారైనా చూడనివారు, మా తోటలోని పొగడ పూల వానలో తడవని వారంటూ బహుశా ఎవ్వరూ ఉండరేమో! మా తోటకి తాకిడి ఎక్కువ అవుతుండటంతో మా కరణంగారు శివాలయం ప్రాంగణాన్ని కూడా ఇలా ఆనందవనంలా మార్చమని నన్ను కోరడంతో సంతోషంగా ఒప్పుకొని గుడి చుట్టుపక్కలంతా రకరకాల పూల మొక్కలను నాటించి వాటి సంరక్షణ కూడా నేనే చేస్తున్నాను. గుడికొచ్చేవారెవరూ ఆ ఉద్యానవనంలో విహరించకుండా వెళ్ళలేరు. ప్రతీరోజు సాయంత్రం అయ్యేసరికి కరణంగారు, శివాలయం పూజారి, సత్యం మాష్టారు, పెద్దిరెడ్డిగారు ఇలా నా వయసు వారంతా శివాలయం ఆవరణలోనో లేక మా తోటలోనో చేరి లోకాభిరామాయణమో, పురాణ సత్కాలక్షేపంతోనో ప్రతీ సాయంత్రం ఆహ్లాదంగా గడిచిపోయేది.

శివాలయం వెనక వైపునే ఓ పెద్ద కోనేరు. దానినిండా ఉండే కలువపూలు దేవుని పూజకై వేచి చూసే భక్తులకు మల్లే ఎప్పుడూ తాజాగా ఉండేవి. మా పెరటి మొక్కల అందాలతో పోటీపడగల దృశ్యం ఆ ఊళ్ళో నాకు తెలిసి ఆ కొనేటి కలువలే. శివాలయంలో కొట్టే గుడిగంటలు ఆహ్లాదంలో ఆధ్యాత్మికతను కూడా రంగరించి నన్ను అనిర్వచనీయమైన అనుభూతులకు లోను చేస్తూ ఉంటాయి.

ఆకాశంలో నక్షత్రాలతో పోటీపడే చెమేలీ పూల అందాలు, మత్తెక్కించే నైట్‌క్వీన్ సౌరభాలతో సంపెంగ పూల గుబాళింపులు పోటీ పడుతుంటే, మేమేమీ తక్కువ కాదంటూ సన్నజాజి, విరజాజి తమ సుగంధ పరిమళాల్ని వెదజల్లుతుంటే 'మీరెంత పోటీపడ్డా మాలాగా మానవుల అభిమానాన్ని చూరగొనడం మీవల్ల కాదు' అంటూ విజయగర్వంతో చూస్తున్నట్లు ఉన్న మల్లెపూలని చూస్తుంటే ఒక్కక్షణం నా మనసు ఆనందంతో పులకరించింది. బావి పక్కన ఈజీచైర్‌లో కూర్చొని పైకి చూస్తుంటే

**ఆంధ్రభూమి దినపత్రిక ఉగాది కథల పోటీలో ఎంపికైన రచన**



ఆకాశాన్ని ముద్దాడుతున్నట్లు కనిపిస్తున్న చెట్ల సమూహాలు 'మనుషుల్లో తగ్గిపోతున్నా మాలో మాత్రం ఇంకా ఆ ఐకమత్యం తగ్గలేదు' అని చెప్తున్నట్లుగా ఉంది. చెట్లనుంచీ రాలుతున్న నూరు వరహాలు, పారిజాతాలు, పున్నాగ పూలు దివినుండీ రాలి భువికి చేరుతున్న తారల్లా అనిపిస్తున్నాయి. ఒక రకమైన సంతృప్తి మనసంతా ఆవరించింది.

ప్రకృతితో నా అనుబంధం ఊహ తెలిసినప్పటి నుంచీ ఉంది. చిన్నప్పుడు నాన్నకి మెడికల్ రిప్రజెంటేటివ్ ఉద్యోగం కావడంతో ఎక్కువగా టూర్లు ఉంటుండేవి. దానితో తాతయ్య వాళ్ళ దగ్గరే పెరిగాను. తాతది వ్యవసాయం. అదీ స్వయంగా చేసుకొనేవాడు. పొలం దగ్గరగా ఉండాలని, పొలం దగ్గరే ఓ మామూలు ఇల్లు కట్టి అక్కడే ఉండేవాళ్ళు. నెమ్మదిగా ఆ చుట్టు పక్కల ప్రాంతాలన్నీ శుభ్రం చేసి అక్కడ చిన్న చిన్న కాయగూరల మొక్కలు పెంచేది బామ్మ. అలా అలా పూల మొక్కలు, ఇతరత్రా కలిపి ఓ చిన్నపాటి వ్యవసాయం చేస్తున్నట్లుండేది. మొదట్లో అడపా, దడపా వెళ్ళేవాళ్ళం. కానీ నేను వాళ్ళకి బాగా దగ్గరవడంతో తిరిగి నాన్న ఉండే ఊరికి వెళ్ళనని మారాం చేసేవాడినట. వాడిదేం పెద్ద చదువులు కావు, ఉండనీలే అని నన్ను కొన్నాళ్ళు వాళ్ళ దగ్గరే ఉంచారు. దాంతో నా బాల్యం మొత్తం ఆ పల్లెటూళ్ళో తాతా, బామ్మల దగ్గరే ఆడుతూ, పాడుతూ గడిచింది.

నా ఆటలు, పాటలు, తిండి, చదువు ఎక్కువగా మా బామ్మ తోటలోనే సాగేది. హైస్కూలకి కాస్త దూరం ఊరు వెళ్ళాల్సి వచ్చినా సైకిళ్ళపై నా స్నేహితులతో కలసి సరదాగా వెళ్ళి రావడం వలన ఆ బాధేమి ఉండేది కాదు. కాస్త స్నేహితులు తగ్గాక పెద్ద క్లాసులలో పుస్తకాలే నా స్నేహితులుగా ఉండేవారు.

ఏ కల్మషం లేని ఆ పచ్చని ప్రకృతి నిజంగా నాలో ఓ కవిని, రచయితని మేల్కొలిపింది. ఆ రోజుల్లోనే సరదాగా ఏవో కవితలు, రచనలు చేస్తూ ఎంతో ఆనందించేవాడిని.

అన్ని రోజులు ఒకలా ఉండవు కదా! నేను డిగ్రీలో చేరడానికి పట్నం వెళ్ళాల్సి వచ్చింది. కొంతకాలం ఆ ఊరికి, మా వాళ్ళకి దూరమయ్యాను. ఆ సమయంలోనే తాతయ్య కాలం చేయడంతో బామ్మని నా దగ్గరికి తెచ్చుకుందామని వెళ్ళాను. కానీ బామ్మ ఆ ఊరు, ఆ ప్రదేశం వదిలి రావడానికి ఇష్టపడలేదు. ''నాకేం ఫర్లేదురా..పొలాన్ని కౌలుకిచ్చాను, నాకీ తోటతో సరిపోతుంది. మీకే తీరికున్నప్పుడు వచ్చి వెళ్తుండండి''

'ఆమెకి ఏ సెంటిమెంట్లు ఉండవా?' అనిపించేది. దేనితోనూ ఎక్కువ అటాచ్‌మెంట్ పెంచుకోకూడదనేది ఆమె ఫిలాసఫీ. అందులోను ముఖ్యంగా మనుషులు, అందులోనూ చుట్టాలు, స్నేహితులు ఇలా సాంసారిక బంధాలలో ఇరుక్కుపోకూడదనేది ఆ రోజుల్లోనే. చేసే పనులు, నిర్వహించాల్సిన సంబంధాలను మనం బాధ్యతగా చెయ్యాలే తప్ప వాటిలో చిక్కుకోకూడదు అనేది. అంత అటాచ్‌మెంట్ పెంచుకోవాలంటే మనుషులతో కన్నా ఈ మొక్కలతో పెంచుకో. ఆరోగ్యానికి ఆరోగ్యం, ఆహ్లాదం, ఆనందం ఇలా అన్నీ పంచుతాయి నీకు అంటూ నవ్వేది. ఆమె ఏనాడూ ఇంగ్లీషు మందులు వాడటం నేనెరుగను. ఎప్పుడైనా ఏ తేడా చేసినా అంతా ప్రకృతి వైద్యం, ఆ వనమూలికలు అవే ఉండేవి. ఎంత వయసు వచ్చినా అన్ని పనులు తానే చేసుకొంటూ ఆరోగ్యంగా ఉండేది. చదువు, ఉద్యోగం నన్ను మా ఊరి నుండీ, ముఖ్యంగా మా బామ్మ నుండీ చాలా దూరం చేశాయి భౌతికంగానే. కానీ మానసి

కంగా ఆమె ప్రభావం నాపై ఎప్పుడూ ఉండేది. ముఖ్యంగా నా పనులన్నీ నా కర్తవ్యంగా చేసేవాడినే కానీ వాటితో సెంటిమెంటల్‌గా అటాచ్ అవకుండానే ఉండే వాడిని.

యమున నా జీవితంలో ప్రవేశించడం, బామ్మ శాశ్వతంగా మమ్మల్నందరినీ వదిలి వెళ్ళడం చాలా తక్కువ వ్యవధిలోనే జరిగాయి నా జీవితంలో.

యమునది దాదాపు పూర్తిగా బామ్మకి వ్యతిరేకమైన మనస్తత్వం. తాను ఉమ్మడి కుటుంబం లోనుండి రావడమో లేక తన పెంపకమో తెలియదు కానీ యమునకి బంధాలూ, అనుబంధాలపై ఆపేక్ష ఎక్కువ. ఎప్పుడూ అందరితో కలివిడిగా ఉండేది. దానికి తగ్గట్లుగానే ఎప్పుడూ ఎవరో ఇంట్లో ఏదో ఒక పేరంటమో, ఫంక్షనో అంటూ జీవితాన్ని చాలా వేగంగా గడిపేది. ఒక రకంగా బామ్మ పోయిన తర్వాత నేను త్వరగా మామూలు మనిషినవడానికి యమున సావాసమే ఓ ముఖ్య కారణం అనుకొంటుంటాను.

పిల్లలు పుట్టాక వాళ్ళ పెంపకం, చదువులు ఇలా యమున మరింత తీరిక లేకుండా ఉండేది. ఉద్యోగరీత్యా పట్టణాలలో ఉండాల్సి రావడంతో ప్రకృతితో సావాసం నాకు అందని ద్రాక్షగానే ఉండేది.

జీవితం ఎప్పుడూ ఒకేలా సాగకపోవడమే కదా విధి విలాసం, అనుకోకుండా ఓ రోజు పెద్దాడు ఓ అమ్మాయిని ప్రేమించానని, తనతో పెళ్ళి చేయకపోతే ఇంట్లోంచి వెళ్ళిపోతానని షాకివ్వడంతో అతనిపై ఎన్నో ఆశలు పెట్టుకొన్న యమున కొంతకాలం మంచం పట్టింది. పరువుకోసమో, లేక నలుగురిలో తలెత్తుకు తిరగడం కోసమో, లేక కనీసం కొడుకు కళ్ళముందైనా ఉండడేమో అనో వాడి పెళ్ళికి ఒప్పుకొంది గానీ, ఎక్కువ కాలం కొడుకుని తన దగ్గర ఉంచుకోలేకపోయింది. జీవితంలో అభివృద్ధి పేరుతో పెద్దకొడుకు, కోడలు విదేశాలు వెళ్ళిపోయినా, తన జీవితంలో నుండే వెళ్ళినంత బాధపడింది. గోరుచుట్టుపై రోకలిపోటులా ఓ రోజున ఉత్తరం రాసి పెట్టి కూతురు తనకు నచ్చిన వాడిని పెళ్ళి చేసుకోవడానికి ఇంట్లోంచి వెళ్ళిపోవడంతో యమున దాదాపు పేషెంట్‌లా తయారయ్యింది. అసలు తను బ్రతకడమే కష్టం అనుకొన్నాం.

ఇంత బాధల్లోనూ అంత నిబ్బరంగా ఎలా ఉంటున్నావయ్యా అనే లోకుల ప్రశ్నలకు చిరునవ్వే నా సమాధానంగా ఉండేది. కానీ అది నా బామ్మ ప్రభావమని నాకొక్కడికే తెలుసు. ఇద్దరు పిల్లలు ఇలా అవ్వడం, రిటైర్‌మెంట్ దగ్గర పడటంతో ఇక నా భవిష్యత్ ప్రణాళికలు మొదలయ్యాయి. ముందుగా మా పల్లెటూరు వెళ్ళిన నాకు చేదు అనుభవమే ఎదురైంది. గుర్తుపట్టలేని విధంగా ఆనాటి ఆ పొలాలన్నీ ఇళ్ళ స్థలాలైనాయి. మా బామ్మ పోవడంతోనే మా నాన్న ఆ ఇళ్ళు పొలాలూ అమ్మేయడంతో అక్కడి రూపురేఖలు పూర్తిగా మారిపోయినాయి.

చివరికి ఆ ఊరికి ఆనుకొని ఉండే ఓ ప్రశాంతమైన గ్రామశివార్లలో ఓ చిన్న స్థలం తీసుకొని దానినే బాగు చేయించి మళ్ళా మా బామ్మ తోటలాంటి ప్రదేశానికి శంకుస్థాపన చేశాను. ప్రస్తుతం మేముంటున్నది ఆ ప్రదేశంలోనే. రిటైరయ్యేలోగానే అక్కడో ఇల్లు, చిన్నతోట ఏర్పాటు చేసుకొన్నాను. రిటైరయ్యాక అక్కడికి వెళదామంటే ముందు మా ఆవిడ ఒప్పుకోలేదు. తను కనీసం తన చిన్నకొడుకు దగ్గరైనా ఉండిపోతానంది. తన అన్నయ్య, చెల్లెలు చేసిన పనుల వల్లో, ఏమో మా రెండోవాడు మేము చూసిన సంబంధమే చేసుకొని, పట్నంలో మాతోపాటే ఉండేవాడు. అయితే మారుతున్న సామాజిక పరిస్థితులలో దూరముంటేనే దగ్గర అనిపించేది నాకు. అందుకే మా ఆవిడకి అనేక విధాలు చెప్పి చూశాను. కనీసం అక్కడ ఉండి అప్పుడప్పుడు వీడిని చూసి రావడం వలన వీడితోనైనా సంబంధాలు బాగుంటాయేమోనని, కనీసం కొంతకాలం అక్కడకొచ్చి ఉండమని, అక్కడ నచ్చకపోతే తిరిగి కొడుకు దగ్గరకు వెళ్ళవచ్చుననే షరతుపైనే మా ఆవిడ ఇక్కడికొచ్చింది.

ముందు ఆ ప్రశాంత వాతావరణం, పరిచయం లేని గ్రామస్తులు, మా ఆవిడకి ఇబ్బంది అనిపించినా, రాను రాను తనలో ఏదో ఒక కొత్త ఉత్సాహాన్ని చూశాను. తన సహకారంతోనే మా పెరట్లో అనేక పూల మొక్కలు, కాయగూరల చెట్లు పెంచాము. అవన్నీ పెరిగి ఎప్పుడూ మా తోట ఓ అందమైన పూలవనంలాగా, కాయగూరలు నిండి ఆకర్షణీయంగా కళకళలాడుతూ ఉండేది. మాకు మొదట్లో ఎంతో అపురూపంగా అనిపించినా రాను రాను ఆ పూలు, కాయగూరలు అందరికీ పంచడంలోనే మాకు ఎక్కువ ఆనందం, తృప్తి కలిగేవి. మేము ఏనాడూ ఎవరినుండి ఏది ఆశించకపోయినా అందరూ తమకున్న దానినే పంచుకొంటూ ఆ గ్రామమే ఓ ఉమ్మడి కుటుంబంలా ఆప్యాయతలతో కలసి మెలసి ఉండేది. ఇక మా ఆవిడకి ఏ అనారోగ్యమూ ఈ అనుబంధాల బంధనాలతో రాదని నాకు బాగా తెలుసు. దానికి కారణం ప్రస్తుతం తన బంధం, అనుబంధం ఈ మొక్కలతోనే. వాటిపై కూడా తనకి భవిష్యత్‌లో ఎలాంటి ఫిర్యాదులు ఉండవు. కారణం ఈ మొక్కలు, చెట్లు తనని విడిచి ఎక్కడికీ వెళ్ళవు, ఎవరినీ మోసం చేయవని మాకు బాగా తెలుసు కనుక.

☆

## ఐదేళ్ల తర్వాతే పెళ్లి!

**ఇటీవలే పాతికేళ్ల బర్త్‌డే జరుపుకున్న అశిన్‌కి హిందీ 'గజినీ'లో చాన్స్ వచ్చినట్టే వచ్చి చేజారిపోయిందిట. ఎందుకలా జరిగిందో కూడా తనకి తెలియదని చెప్పే అశిన్ ప్రస్తుతం తన కెరీర్ ఉన్న తీరు తనకెంతో సంతృప్తికరంగా వుందంటోంది. పెళ్లి మాటేంటి? అనడిగితే- అప్పుడే పెళ్లేంటి? మరో ఐదేళ్ల తర్వాతే పెళ్లి గురించి ఆలోచిస్తా అంటోంది అందాల అశిన్.**

